శుక్రవారం 21-6-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 371, పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## వడగాలులకు 9 రోజుల్లో 192 మంది మృతి

- పుట్‌పాత్‌లపైనే బతికే నిరాశ్రయులే బలి
- పగటిపూట అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు



ముందడుగు జాతీయం:

దేశరాజధాని ఢిల్లీ సహా పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భానుడు విశ్వరూపం చూపిస్తున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. ముఖ్యంగా రాజధాని ఢిల్లీలో పరిస్థితి దారుణంగా ఉంది. ఢిల్లీ మొత్తం నిప్పుల కొలిమిలా మారింది. ఓవైపు ఎండ తీవ్రత.. మరోవైపు నీటి సంక్షోభంతో ఢిల్లీ వాసులు అల్లాడిపోతున్నారు. రాత్రి సమయంలో కూడా వాతావరణం చల్లబడటం లేదు. గత 14 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా రాత్రి వేళ కూడా రాజధానిలో 35.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైంది. దీంతో వడదెబ్బకు ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. వడదెబ్బ బాధితులతో ఆసుపత్రులన్నీ కిక్కిరిపోతున్నాయి. మిగతా 2లో




## స్వతంత్ర విద్యావ్యవస్థ ధ్వంసమైంది

- కొందరి నియంత్రణ కారణంగానే పేపర్ లీక్‌లు
- అవకతవకలను పార్లమెంట్‌లో లేవనెత్తుతాం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం

ముందడుగు జాతీయం:

దేశ విద్యావ్యవస్థపై కొందరి నియంత్రణ కారణంగానే ఈ పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ నియంత్రణకు మోదీజీ అవకాశం ఇచ్చారు. వైస్ ఛాన్సలర్ల నియామకాలు ప్రతిభ ఆధారంగా జరగడం లేదు. స్వతంత్ర విద్యావ్యవస్థ ధ్వంసమైంది. ఇలాంటి పరిణామాలకు కారకులైన వారికి శిక్ష పడాలి. ఈ పరిస్థితి మారనంత కాలం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఇది దేశ వ్యతిరేక చర్య. ఈ అవకతవకలను మేం పార్లమెంట్‌లో లేవనెత్తుతాం" అని రాహుల్ వెల్లడించారు. అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి కేంద్ర విద్యాశాఖ మంత్రి క్లీన్ మిగతా 2లో



### హజ్ యాత్రలో 1000కి పైగా మృతి

వివరాలు 2లో




### పద్మనాభం.. ఇక పద్మనాభరెడ్డి

వివరాలు 2లో



### వందేభారత్ రైలు భోజనంలో బొద్దింక

వివరాలు 3లో



### ఎక్కువ సేపు మూత్రాన్ని ఆపొద్దు

వివరాలు 4లో

## కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు

- ఈడీ విజ్ఞప్తిని తోసిపుచ్చిన న్యాయస్థానం
- హర్షం వ్యక్తం చేసిన ఆప్ నేతలు

ముందడుగు ఢిల్లీ:

ఢిల్లీ లిక్కర్ విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢీల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో 48 గంటల పాటు బెయిల్ ఆర్డరును నిలిపివేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసులో మార్చి 21న ఈడీ కేజ్రీవాల్‌ను మిగతా 2లో



## బొగ్గు గనుల విషయంలో కుట్ర జరుగుతోంది

### బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపణ


ముందడుగు తెలంగాణ:

తెలంగాణ సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా, కావాలనే కుట్ర జరుగుతోందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మిగతా 2లో



ముందడుగు
శుక్రవారం, 21-6-2024, హైదరాబాద్

## వడగాలులకు 9 రోజుల్లో
# 192 మంది మృతి



మొదటిపేజీ తరువాయి

ఇక ఉండేందుకు ఇల్లు లేక ఫుట్‌పాత్‌లపైనే కాలం వెళ్లదీసే నిరాశ్రయుల పరిస్థితి గురించైతే చెప్పాల్సిన అవసరం లేదు. జూన్ 11 నుంచి జూన్ 19వ తేదీ వరకూ తొమ్మిది రోజుల వ్యవధిలో ఏకంగా 192 మంది నిరాశ్రయులు ప్రాణాలు కోల్పోయారు. వడదెబ్బ కారణంగానే వీరంతా మరణించారని ఎన్జీవో సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ పేర్కొంది. NGO ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అలెడియా మాట్లాడుతూ.. 'జూన్ 11 నుంచి 19వ తేదీ వరకూ తీవ్రమైన వేడి పరిస్థితుల కారణంగా ఢిల్లీలో 192 మంది నిరాశ్రయుల మరణించారు' అని తెలిపారు. గత ఐదేళ్లలో నమోదైన అత్యధిక మరణాలు ఇవే అని ఎన్జీవో తెలిపింది. 2019 జూన్ 11 నుంచి 19 వరకూ 143 మంది, 2020లో జూన్ 11 నుంచి 19 వరకూ 124 మంది, 2021లో జూన్ 11 నుంచి 19 వరకూ 58 మంది, 2022లో జూన్ 11 నుంచి 19 వరకూ 150 మంది, 2023 జూన్ 11 నుంచి 19 వరకూ 75 మంది నిరాశ్రయులు వడదెబ్బ కారణంగా మరణించినట్లు వెల్లడించింది. ఇప్పుడు మాత్రం ఏకంగా 192 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వివరించింది.



# స్వతంత్ర విద్యావ్యవస్థ ధ్వంసమైంది

మొదటిపేజీ తరువాయి

చిట్ ఇవ్వడాన్ని తప్పపట్టారు. తాము ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో ఉన్నామో ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. ఇప్పుడు మోడీ ప్రధాన ఎజెండా స్పీకర్ ఎన్నిక. ఆయన తన ప్రభుత్వం, స్పీకర్ పదవి గురించి ఆలోచిస్తున్నారు. మోడీ ప్రజలను భయపెడుతూ ప్రభుత్వాన్ని నడిపిస్తుంటారు. కానీ ఇప్పుడు ప్రజలు భయపడటం లేదు. ఈ ఎన్నికల ఫలితాలు ఆ విషయాన్ని వెల్లడిచేశాయి. వినయం, గౌరవం, రాజీ వంటి పదాలకు మాజీ ప్రధానులు అటల్ బిహారీ వాజ్‌పేయిూ, మన్మోహన్ సింగ్ గౌరవమిచ్చారు. నరేంద్రమోదీకి వాటిపై నమ్మకం లేదు'' అని రాహుల్ దుయ్యబట్టారు. ఇదిలా ఉంటే.. జూన్ 21న యోగా డే రోజున నీట్‌లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

# కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు



మొదటిపేజీ తరువాయి

ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.
బెయిల్ పిటిషన్‌కు సంబంధించి గురువారం ఉదయం (జూన్ 20న) తీర్పు రిజర్వ్ చేసిన రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి నియాయ్ బిందు.. అదే సాయంత్రం బెయిల్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, బెయిల్ బాండుపై సంతకం చేసేందుకు వీలుగా 48 గంటలపాటు స్టే విధించాలని న్యాయస్థానాన్ని ఈడీ కోరింది. తద్వారా ఈ తీర్పును పై కోర్టులో సవాలు చేసేందుకు వీలు కలుగుతుందని విన్నవించింది. అయినప్పటికీ ఈడీ వాదనను తోసిపుచ్చిన కోర్టు.. అందుకు నిరాకరించింది. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడంపై ఆప్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిశీ సత్యమే గెలిచిందన్నారు. సత్యానికి కొన్నిసార్లు ఇబ్బందులు రావొచ్చేమో గానీ.. ఓటమి మాత్రం ఉండదన్నారు.

## బొగ్గు గనుల విషయంలో
# కుట్ర జరుగుతోంది

మొదటిపేజీ తరువాయి


మాట్లాడారు. 16 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో నిర్ణయాత్మకంగా ఉంటామని కేసీఆర్ చెబితే.. వాటితో ఏం చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 16 ఎంపీ సీట్లు వచ్చిన తెదేపా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్‌కు చెరో 8 సీట్లు ఉన్నాయి. బొగ్గు గనుల వేలం పెట్టవద్దని గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోడీకి లేఖ రాశారు. ఒడిశాలో రెండు గనులను వేలం లేకుండా నైవేలీ లిగ్నైట్‌కు అప్పగించారు. గుజరాత్‌లో రెండు ప్రభుత్వ రంగ సంస్థలకు 2015లో వేలం లేకుండానే నేరుగా నాలుగు గనులు కేటాయించారు.
తమిళనాడులో కూడా బొగ్గు గనులను వేలం నుంచి మినహాయించాలని ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు అన్నామలై కేంద్ర మంత్రిని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్లే నష్టాల్లోకి వెళ్లింది. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్ల అనే గనిని క్యాప్టివ్ మైన్ కింద కేటాయించాలని వైజాగ్ స్టీల్ ప్లాంట్ అడిగితే కేంద్రం ఇవ్వలేదు. ఆప్షన్‌లో అదానీకి అప్పగించింది. సొంత గనిలేకపోవడంతో నష్టాల్లోకి వెళ్లిన విశాఖ ఉక్కును అమ్మాలని చూశారు. ఇప్పుడు సింగరేణి విషయంలో కూడా అదే విధమైన వ్యూహం అలవంబించ బోతున్నారు. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్ర ఇది. 2021 డిసెంబరు 11 నాడు సింగరేణికి కోల్ బ్లాక్స్ కేటాయించాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి వైఖరి ఎందుకు మారింది? వేలంలో పాల్గొంటామని ఇప్పుడు చెబుతున్నారు.
తెలంగాణలోని బొగ్గు గనులు వేలం వేయకుండా ఇప్పటి వరకు బిఆర్ఎస్ రక్షణ కవచంలా నిలిచింది'' అని కేటీఆర్ అన్నారు.

# హజ్ యాత్రలో 1000కి పైగా మృతి

- వడగాలులతో సౌదీ అరేబియా ఉక్కిరిబిక్కిరి
- ఈ ఏడాది 18.3 లక్షలమంది హజ్ యాత్ర పూర్తి

ముందడుగు సౌదీ అరేబియా:

హజ్ యాత్రకు వెళ్లిన వారిలో వడదెబ్బ కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య 1000 దాటినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. వీరిలో అత్యధికులు ఈజిప్టు దేశస్థులే కాగా.. భారత్, పాకిస్థాన్, జోర్డాన్, ఇండోనేషియా, ఇరాన్, సెనెగల్, ట్యూనిషియాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. మృతి చెందినవారిలో అత్యధికంగా ఈజిప్టు వాసులే ఉన్నట్లు అరబ్ రాయబారి వెల్లడించారు. గురువారం ఒక్కరోజే ఆ దేశానికి చెందిన 58 మంది చనిపోగా.. మొత్తం మరణాల సంఖ్య 658కి చేరింది. వీరిలో 630 మంది అనుమతి లేని యాత్రికులే ఉన్నట్లు సమాచారం. మొత్తంగా 10 దేశాలకు చెందిన 1081 మంది యాత్రికులు ఎండ దెబ్బకు మరణించినట్లు తెలిసింది. ఆయా దేశాల రాయబార కార్యాలయాల ప్రకటనల ఆధారంగా ఈ సంఖ్యను లెక్కించినట్లు సమాచారం. మెడికల్ కాంప్లెక్సు వద్ద కొంతమంది మృతుల



వివరాలు ప్రకటించారు. జాబితాలో అల్జీరియా, ఈజిప్టుతోపాటు భారత్‌కు చెందినవారి పేర్లు కూడా ఉన్నాయి.

అయిదు రోజుల హజ్ యాత్రలో భాగంగా ఈ ఏడాది మొత్తం 18.3 లక్షలమంది హజ్ యాత్ర పూర్తి చేసుకున్నారు. ఇందులో 22 దేశాలకు చెందిన యాత్రికులు 16 లక్షలమంది ఉండగా, సౌదీ పౌరులు రెండు లక్షలకు పైగా ఉంటారని సౌదీ హజ్ అధికార యంత్రాంగం తెలిపింది. యాత్ర అనుమతి కోసం భారీగా ఖర్చు అవుతుండటంతో చాలామంది అక్రమ మార్గాల్లో మక్కాకు చేరుకుంటున్నారు. ఇలా వచ్చే వేల మందిని స్థానిక అధికారులు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ.. వారి సంఖ్య ఎక్కువగానే ఉంటున్నట్లు తెలుస్తోంది. యాత్ర ముగిసిన తర్వాత.. రిజిస్టర్ చేసుకున్న వారికే అక్కడ అధికారులు ఏర్పాటు చేసిన తాత్కాలిక ఏసీ షెల్టర్లలో బస చేసేందుకు అనుమతి ఉంటుంది. అందుకే మరణిస్తున్న వారిలో రిజిస్టర్ చేసుకోని వారే అధికంగా ఉన్నారని అధికారులు చెప్పారు.

## పద్మనాభం..
## ఇక పద్మనాభరెడ్డి



ముందడుగు

వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం పేరును ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుతూ గురువారం ఏపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్‌ను ఓడించకపోతే తన పేరు మార్చుకుంటానని ఎన్నికల సమయంలో ముద్రగడ సవాల్ చేశారు. పవన్ ఎన్నికల్లో గెలవడంతో తన సవాల్‌కు కట్టుబడుతూ పేరు మార్పునకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన పేరును మార్చుతూ గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు.

ముందడుగు
శుక్రవారం, 21-6-2024, హైదరాబాద్

# వందేభారత్ రైలు భోజనంలో బొద్దింక

- క్షమాపణలు చెప్పిన ఐఆర్‌సీటీసీ
- సర్వీస్ ప్రొవైడర్‌కు జరిమానా విధించామని వెల్లడి

ముందడుగు జాతీయం:

కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అందించే ఆహారంపై గత కొన్ని రోజులుగా ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. సాధారణ రైళ్లలో కంటే వందేభారత్‌లో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ఫుడ్ మాత్రం సరిగా ఉండటం లేదని.. పాచిపోయిన, పురుగులు పడిన ఆహారం వచ్చిందంటూ ప్రయాణికుల నుంచి ఇప్పటికే ఫిర్యాదులు అందాయి. తాజాగా ఓ జంటకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. వందే భారత్‌లో అందించిన ఫుడ్‌లో చచ్చిన బొద్దింక దర్శనమిచ్చింది.

భోపాల్ నుంచి ఆగ్రాకు వందేభారత్ రైలులో ప్రయాణించిన దంపతులకు ఈ అనుభవం ఎదురైంది. వారు ఆర్డర్ చేసిన ఫుడ్‌లో బొద్దింక కనిపించింది. దీంతో ఈ విషయాన్ని విదిత్ వర్ష్నే



అనే నెటిజన్ ఎక్స్ లో పోస్టు చేశారు. 'ఈనెల 18వ తేదీన మా ఆంటీ, అంకుల్ వందేభారత్ రైలులో భోపాల్ నుంచి ఆగ్రా వరకూ ప్రయాణించారు. ఆ సమయంలో ఐఆర్‌సీటీసీ పెట్టిన భోజనంలో బొద్దింక వచ్చింది' అని పోస్టు పెట్టారు. అంతేకాకుండా ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోండి అంటూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ట్యాగ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. అయితే, ఈ ఘటనపై ఐఆర్‌సీటీసీ క్షమాపణలు చెప్పింది. సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌పై చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. 'మీకు కలిగిన అనుభవానికి క్షమాపణలు కోరుతున్నాము. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాం. సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌కు తగిన జరిమానా విధించాం' అని తెలిపింది.

# పిన్నిని లైంగికంగా వేధించిన బాలుడు

## ఆమె మందలించడంతో హత్య చేసాడు

ముందడుగు కర్ణాటక:

పదవ తరగతి చదువుతున్న బాలుడు పిన్నిని లైంగికంగా వేధించాడు. బాలుడి చేష్టలకు ప్రతిఘటించిన ఆమె అతడిని తీవ్రంగా మందలించింది. దీని గురించి కుటుంబ సభ్యులకు చెబుతుందన్న భయంతో ఆ మహిళను బాలుడు హత్య చేశాడు. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఉప్పినంగడి సమీప గ్రామానికి చెందిన 37 ఏళ్ల మహిళ ఆదివారం రాత్రి ఇంట్లో అనుమానాస్పదంగా మరణించింది. ఆ మహిళ ఇంట్లో ఉన్న పదో తరగతి చదువుతున్న బాలుడు తన తండ్రికి ఫోన్ చేశాడు. గుండెపోటుతో పిన్ని చనిపోయిందని చెప్పాడు.




మహిళ అనుమానాస్పద మరణం గురించి తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఆమె ఇంట్లో ఉన్న బాలుడిపై అనుమానం వ్యక్తం చేశారు. తన కుమారుడి వీపుపై చేతితో రక్కిన ఆనవాళ్లు ఉన్నట్లు బాలుడి తండ్రి పోలీసులకు తెలిపాడు. బుధవారం బాలుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దీంతో ఆమెను తానే చంపినట్లు అతడు ఒప్పుకున్నాడు. ఇంట్లో నిద్రిస్తున్న పిన్నితో లైంగిక చర్య కోసం ప్రయత్నించినట్లు ఆ బాలుడు తెలిపాడు. ప్రతిఘటించిన ఆమె తనను మందలించిందని పోలీసులకు చెప్పాడు. అయితే ఇంట్లో వారికి దీని గురించి చెబుతుందేమోనని భయాందోళన చెందానని అన్నాడు. తిరిగి నిద్రలోకి జారుకున్న పిన్ని ముఖాన్ని దిండితో నొక్కి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. తనను తోసివేసేందుకు ప్రయత్నించినప్పుడు తన వీపుపై ఆమె రక్కిందని పోలీసులకు వెల్లడించాడు. ఆ బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రామాయణాన్ని కించపరుస్తూ విద్యార్థుల నాటకం

- ఒక్కో విద్యార్థికి రూ.1.20 లక్షల జరిమానా
- ప్రతిష్ఠాత్మక ఐఐటీ బాంబే విద్యాసంస్థ నిర్ణయం

ముందడుగు ముంబాయి:

ఐఐటి బాంబే విద్యార్థులు రామాయణాన్ని కించపరుస్తూ నాటకం వేశారని భావిస్తూ ప్రతిష్ఠాత్మక ఐఐటీ బాంబే విద్యాసంస్థ భారీ జరిమానా విధించింది. ఒక్కో విద్యార్థికి ఏకంగా రూ.1.20 లక్షల చొప్పన ఫైన్ వేసింది. ఈ ఏడాది మార్చి 31వ తేదీన ఐఐటీ బాంబేలో వార్షిక ఆర్ట్స్ ఫెస్టివల్ జరిగింది. ఫెస్ట్‌లో భాగంగా కొందరు విద్యార్థులు 'రాహోవన్' పేరుతో నాటకాన్ని ప్రదర్శించారు. రామాయణానికి ఇది పేరడీ. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వీడియోలు చూసిన పలువురు ఈ స్కిట్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నాటకంలో భాగంగా విద్యార్థులు ఉపయోగించిన భాష, హావభావాలు అనుచితంగా



ఉన్నాయంటూ విమర్శలు చేస్తున్నారు. హిందువులు ఎంతో గొప్పగా భావించే రామాయణాన్ని కించపరిచారని ఆరోపించారు. మత విశ్వాసాలను దెబ్బ తీసేలా ఈ స్కిట్ ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఐఐటీ బాంబే యాజమాన్యం చర్యలు చేపట్టింది. క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేసి ఘటనపై దర్యాప్తు జరిపించింది. అనంతరం స్కిట్ ప్రదర్శించిన ఎనిమిది మంది విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. 8 మందిలో నలుగురికి ఒక్కొక్కరికి రూ.1.2 లక్షల జరిమానా విధించగా మరో నలుగురికి ఒక్కొక్కరికీ రూ.40 వేల ఫైన్ వేసింది. దీంతోపాటు హాస్టల్ నుంచి డిబార్ చేసింది. మరో నెల రోజుల్లోగా ఈ జరిమానా చెల్లించాలని తేల్చి చెప్పింది. ఈ నిబంధనల్ని ఉల్లంఘిస్తే మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

# నిర్వాసితుల కోసం మేధా పాట్కర్ ఆందోళన

## దేశ వ్యాప్తంగా పెరుగుతున్న మద్దతు

ముందడుగు గుజరాత్:

'నర్మదా బచావో ఆందోళన్' ఉద్యమకారిణి సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్ కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని కోసం గత వారం రోజులుగా ఆమె ఆందోళన చేస్తున్నారు. 'నర్మదా బచావో ఆందోళన్' ఉద్యమకారిణి అయిన ఆమె మధ్యప్రదేశ్ చిఖల్దా గ్రామంలోని ఖేదా బస్తీలో నిరసన చేపట్టారు. నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేధా పాట్కర్ ఆందోళనకు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. ఒడిశాకు చెందిన కార్యకర్త ప్రఫుల్ల సమంతర, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సామాజిక కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే, సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు డాక్టర్ సునీలం బుధవారం ఖేడా బస్తీకి చేరుకున్నారు. మేధా పాట్కర్ నిరసనకు మద్దతు తెలిపారు. సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల పునరావసం కోసం కేంద్ర,



రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించాలని వారు డిమాండ్ చేశారు. నిర్వాసితుల డిమాండ్లను నెరవేర్చకపోతే మేధా పాట్కర్ ఆందోళనను దేశ వ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు.

ముందడుగు
శుక్రవారం,
21-6-2024,
హైదరాబాద్

# జమ్మూలో ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే వంతెన

## చారిత్రక వంతెనపై రైలు ట్రయల్ పూర్తి




ముందడుగు జాతీయం:
ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన జమ్మూకశ్మీర్‌లోని చీనాబ్ నదిపై నిర్మించారు. ఇంజినీరింగ్ అద్భుతంగా నిలిచిన ఈ చారిత్రక వంతెనపై రైలు ట్రయల్ రన్‌ను గురువారం విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగల్దన్ నుంచి రియాసీ వరకు రైలును ప్రయోగాత్మకంగా నడిపారు. మధ్యలో చీనాబ్ నదిపై నిర్మించిన వంతెన ప్రధాన ఆర్చ్‌పై రైలు పరుగులు పెడుతున్న దృశ్యాలు వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల ఈ బ్రిడ్జ్‌పై జూన్ 16న ఓ రైలు ఇంజిన్‌తో ట్రయల్ రన్ నిర్వహించిన సంగతి తెలిసిందే. చీనాబ్ నదిపై కట్టిన ఈ రైల్వే వంతెన మీదుగా రాంబన్ నుంచి రియాసీకి అతి త్వరలో రైలు సర్వీసులు ప్రారంభం కానున్నాయి.

కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపుర్ - శ్రీనగర్ - బారాముల్లా రైల్వే ప్రాజెక్టులో భాగంగా చీనాబ్ వంతెనను నిర్మించారు. నదీగర్భం నుంచి 359 మీటర్ల ఎత్తున ఉన్న ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు. ఇప్పటివరకూ చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వేవంతెన పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం.

# ఎక్కువ సేపు మూత్రాన్ని ఆపొద్దు

## మూత్రం ఆపుకుంటే చాలా ఇబ్బందులు ▪ వీటి వల్ల ఎన్నో ఆనారోగ్య సమస్యలు

ముందడుగు ప్రత్యేకం:
చాలా మంది మహిళలు కానీ, పురుషులు కానీ లేదా విద్యార్థులు కానీ ముఖ్యమైన పని ఉన్నప్పుడు, బయటకు వెళ్లినప్పుడు మూత్రం వచ్చినా.. ఆపుకొంటూ ఉంటారు. కానీ మూత్రం ఆపుకుంటే చాలా ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆడవారు బయటకు వెళ్లినప్పుడు టాయిలెట్స్ అందుబాటులో లేనప్పుడు చాలా సేపు ఆపుకుంటూ ఉంటారు. అయితే దీని వల్ల ఎన్నో ఆనారోగ్య సమస్యలు వస్తాయి.



### కటి నొప్పి వచ్చే అవకాశం

వయసును బట్టి మూత్రాన్ని కొంతసేపటి వరకు ఆపుకోవచ్చని వైద్యులు అంటున్నారు. సాధారణంగా చిన్న పిల్లలు అంటే 10 సంవత్సరాల లోపు వారు మూత్రాన్ని గంట వరకు ఆపుకోగలరు.. అదే 10 సంవత్సరాలు దాటిన వారు దాదాపు రెండు గంటల వరకు మూత్రాన్ని ఆపుకున్నా పెద్ద ఇబ్బంది పడరు. 30 సంవత్సరాలు దాటిన వారు మూడు నుంచి 5 గంటల వరకు మూత్రాన్ని ఆపుకోగలుగుతారని నిపుణులు చెబుతున్నారు. అయితే మూత్రాన్ని ఎక్కువ సేపు ఆపుకోవడం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. దీని కారణంగా మీ మూత్రాశయ కండరాలు బలహీనపడతాయి. అంతేకాదు ఎక్కువ సేపు ఇలా ఆపుకుంటూ పోతే.. మూత్రాన్ని ఆపుకునే సామర్థ్యం క్రమంగా తగ్గుతూ పోతుంది. అలాగే మూత్రం లీక్ అయ్యే ప్రమాదం కూడా కలిగిస్తుంది. మూత్రాన్ని ఎక్కువసేపు బిగపట్టుకోవడం వల్ల మీకు కటి నొప్పి వచ్చే అవకాశం కూడా ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య కటి తిమ్మిరిగా కూడా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని కారణంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ కూడా రావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో మీరు మూత్రాశయాన్ని ప్రతి కొన్ని నిమిషాలకోసారి ఖాళీ చేయాలి. ఇది యూటీఐ ప్రమాదాన్ని బాగా పెంచుతుంది.

### కిడ్నీలో రాళ్లు మళ్లీ ఏర్పడతాయి

మూత్రాన్ని ఎక్కువసేపు పట్టుకోవడం వల్ల మీ మూత్రాశయం సాగిపోతుంది. ఇలాంటి పరిస్థితిలో ఆ తర్వాత మూత్ర విసర్జన చేయడం మీకు చాలా కష్టంగా ఉంటుంది. దీనితోపాటు మీకు ఇంతక ముందు ఎప్పుడైనా మూత్రపిండాల్లో రాళ్ల సమస్యలు ఉంటే.. మూత్రాన్ని ఎక్కువసేపు ఆపకండి. ఎందుకంటే ఇలా చేయడం వల్ల కిడ్నీలో రాళ్లు మళ్లీ ఏర్పడతాయి. అందుకే ఎక్కువ సమయం మూత్రం ఆపుకొనేందుకు యత్నించకూడదని వైద్యులు చెబుతున్నారు.

# ట్రాఫిక్‌ను చూసి క్యాబ్‌ని వదిలి హెలికాప్టర్‌ని ఎంచుకున్న యువతి..

ముందడుగు జాతీయం:
న్యూయార్క్ లోని భయంకరమైన ట్రాఫిక్ పెట్టె ఇబ్బంది నుంచి బయటపడడానికి భారతీయ సంతతికి చెందిన ఖుషీ సూరి ఒక ప్రత్యేకమైన పద్ధతిని అవలంభించింది. తన గమ్యస్థానమైన విమానాశ్రయానికి చేరుకోవడానికి క్యాబ్‌కు బదులుగా హెలికాప్టర్ రైడ్ ను ఎంపిక చేసుకుంది. మాన్‌హాటన్ నుంచి జాన్ ఎఫ్ కెన్నెడీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లాలని ఖుషీ చెప్పింది. ట్రాఫిక్‌ను నివారించడానికి ఉబర్‌లో హెలికాప్టర్ రైడ్ ఎంపికను ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. ఇదేమి పిచ్చి పని అంటారు లేదా ఆమె అంత ధనవంతురాలా? అంటూ ఆలోచిస్తారు కూడా. అయితే ఖుషీ ట్విట్టర్‌లో పంచుకున్న అనుభవాన్ని తెలిస్తే ఎవరైనా సరే ఆశ్చర్యపోతారు. సోషల్ సైట్ ఎక్స్‌లో స్క్రీన్‌షాట్‌ను షేర్ చేసింది. అందులో ఉబెర్ క్యాబ్‌లు, హెలికాప్టర్ రైడ్‌ల ఖర్చు .. ప్రయాణ సమయాన్ని పోల్చింది. ఆ యువతి స్క్రీన్‌షాట్ ప్రకారం ఉబెర్ క్యాబ్ రైడ్ కోసం అంచనా వేసిన ధర $131.99 (అంటే మన దేశ కరెంసిలో రూ. 11,023.47). ఈ క్యాబ్ లో ప్రయాణించి విమానాశ్రయానికి చేరుకోవడానికి గంట సమయం పడుతుంది. అదే సమయంలో మాన్‌హట్టన్ నుంచి ఎయిర్‌పోర్టుకు హెలికాప్టర్ ద్వారా చేరుకోవాలంటే చెల్లించాల్సిన ధర $165 డాలర్లు (మన దేశ కరెంసిలో రూ. 13780.39), అయితే హెలికాప్టర్ ని ఎంచుకుంటే కేవలం ఐదు నిమిషాల్లోనే విమానాశ్రయానికి తీసుకెళ్తామని సదరు కంపెనీ హామీ ఇచ్చింది. రెండు ధరలు పోల్చి చూస్తే.. ధరల్లో పెద్దగా తేడా లేదు.



ముందడుగు
శుక్రవారం, 21-6-2024, హైదరాబాద్

## మత్తు మందు ఇచ్చి అబ్బాయిని
# అమ్మాయిగా మార్చాడు

### పెళ్లి చేసుకునేందుకు స్నేహితుడే చేసిన పని



ముందడుగు ఉత్తరప్రదేశ్:

తనకు నచ్చిన యువకుడిని పెళ్లి చేసుకోవడం కోసం ఏకంగా అతడికి లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించాడు. అది కూడా అతడికి ఏమాత్రం తెలియకుండా మత్తుమందు ఇప్పించి అమ్మాయిగా మార్చేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని ముజపుర్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముజఫర్‌నగర్‌కు చెందిన 20 ఏళ్ల యువకుడికి ఓంప్రకాశ్ అనే వ్యక్తి రెండేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నాడు. ఇటీవల ఆ యువకుడు అనారోగ్యానికి గురవడంతో మెడికల్ చెకప్ చేయిస్తానంటూ ఓంప్రకాశ్ జూన్ 3న మన్సూర్‌పుర్‌లోని బేగ్‌రాజ్‌పుర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ యువకుడిని పరీక్షించిన వైద్యులు చిన్న సర్జరీ చేయాలని సూచించారు. అనంతరం అతడికి మత్తుమందు ఇచ్చి వ్యక్తిగత అవయవాలను తొలగించి లింగమార్పిడి శస్త్రచికిత్స చేశారు. వైద్యులతో కలిసి ప్రకాశ్ నాటకమాడి ఈ తతంగమంతా నడిపినట్లు తెలిసింది.

ఆసుపత్రికి తీసుకొచ్చిన మరుసటి రోజు నాకు ఆపరేషన్ చేశారు. స్పృహలోకి రాగానే నేను అమ్మాయిగా మారిపోయానని చెప్పారు. అప్పుడు ఓంప్రకాశ్ అక్కడికి వచ్చి తానే ఇదంతా చేయించానని అన్నాడు. ఇక నేను జీవితాంతం తనతోనే ఉండొచ్చని చెప్పాడు. పెళ్లి కోసం ఏర్పాట్లు కూడా చేశానన్నాడు. ఇందుకు అంగీకరించకపోతే నా తండ్రిని చంపేస్తానని బెదిరించాడు. మా భూమిని కూడా లాక్కొన్నాడు'' అని బాధిత యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. ఎలాగో ధైర్యం చేసి కుటుంబసభ్యులకు విషయం చెప్పడంతో బాధితుడి తండ్రి జూన్ 16న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఓంప్రకాశ్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర దుమారం రేపింది.

# డిలీట్ మెసేజులు ఇలా చూడొచ్చు


## వాట్సాప్ సెట్టింగ్ లో చిన్న ట్రిక్ వాడండి

ముందడుగు డిజిటల్:

ప్రస్తుత రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వాట్సాప్ ఉపయోగిస్తుంటారు. దీంతో మెసేజ్ లు, ఫొటోలు, వీడియోలు సులభంగా షేర్ చేసుకోవచ్చు. యాప్ లో కాలింగ్, వీడియో కాలింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. గోప్యతని దృష్టిలో ఉంచుకుని యాప్‌లో అనేక గోప్యతా ఆధారిత ఫీచర్‌లు కూడా అందించబడ్డాయి. అలాంటి ఒక ఫీచర్ డిలీట్ ఫర్ ఎవ్రీవన్. దీని కారణంగా, రిసీవర్, పంపిన వారి చాట్‌ల నుండి మేసేజ్ లు డిలీట్ అయిపోతాయి. కానీ, ఇది తొలగించబడిన మేసేజ్ ల జాడను వదిలివేస్తుంది. కొన్ని మేసేజ్ లు పంపబడినట్లు, తొలగించబడినట్లు చూపుతుంది. చాలా మంది డిలీట్ అయిన మెసేజ్ లలో ఏముందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. దీని కోసం కొన్ని థర్డ్ పార్టీ యాప్‌లు ఉన్నాయి, కానీ వాటిని ఉపయోగించడం ప్రమాదకరం. అందువల్ల Android ఫోన్‌లలో అందుబాటులో ఉన్న ఇన్-బిల్ట్ ఫీచర్ గురించి ఇప్పుడు చూద్దాం, దీని ద్వారా తొలగించబడిన మెసేజ్ లను చదవవచ్చు. తొలగించబడిన టెక్స్ట్ మెసేజ్ లు మాత్రమే దీని ద్వారా చెక్ చేయవచ్చు. ఈ ఫీచర్ ఫోటోలు లేదా ఆడియో సందేశాలకు ఉపయోగపడదు. అలాగే, ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ 11, అంతకంటే ఎక్కువ ఆండ్రాయిడ్ వెర్షన్‌లలో మాత్రమే అందుబాటులో ఉంటుంది.




### డిలీట్ అయిన మెసేజ్ లను ఇలా చదవండి:




- ముందుగా ఫోన్ సెట్టింగ్స్ లోకి వెళ్లండి.
- తర్వాత నోటిఫికేషన్‌లపై నొక్కండి.
- దీని తర్వాత మరిన్ని సెట్టింగ్‌లకు(More settings) వెళ్లండి.
- ఆపై నోటిఫికేషన్‌ల చరిత్రకు(Notifications history) వెళ్లండి.
- ఆపై స్క్రీన్‌పై కనిపించే టోగుల్‌ను ఆన్ చేయండి.
- ఈ ఫీచర్‌ని ఆన్ చేసిన తర్వాత, మీరు మళ్లీ Nnotifications ద్వారా నోటిఫికేషన్‌ల హిస్టరీకి వెళ్తారు.
- దీని ద్వారా మీరు 24 గంటల్లో డిలీట్ అయిన టెక్స్ట్ మెసేజ్ లను చూస్తారు.

# ఢిల్లీలో 24 గంటల్లో 22 మంది మృతి

## అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు

ముందడుగు ఢిల్లీ:

దేశ రాజధాని ఢిల్లీని ఎండలు వణికిస్తున్నాయి. ఎండలకు తోడు తీవ్రమైన వడ గాలులు వీస్తున్నాయి. దీంతో గత 24 గంటల్లో 22 మంది హీట్ వల్ల మృతిచెందారు. ఆర్ఎంఎల్, సఫ్దార్‌జంగ్, ఎల్ఎన్జేపీ ఆస్పత్రుల్లో ఆ మరణాలు నమోదు అయ్యాయి. గత కొన్ని రోజుల నుంచి ఢిల్లీలో తీవ్రమైన ఎండలు కొడుతున్నాయి. అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. హీట్‌స్ట్రోక్ వల్ల ఢిల్లీ ఆస్పత్రుల్లో పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో వడదెబ్బ తగిలి 33 మంది పేషెంట్లు ఆడ్మిట్ అయ్యారు. అయితే గడిచిన 24 గంటల్లో ఆ ఆస్పత్రిలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో 22 మంది పేషెంట్లు అడ్మిట్ అవ్వగా, నలుగురు మృతిచెందారు. ఎల్ఎన్జేపీ ఆస్పత్రిలో 17 మంది రోగులు అడ్మిట్ కాగా, దాంట్లో అయిదుగురు మృతిచెందారు. నగరంలోని నిగంబోద్ ఘాట్ శ్మశానవాటికలో రోజువారి దహనం కేసులు పెరిగిపోయాయి. అంతిమ సంస్కారాల నిర్వహణ కోసం ఆ ఘాట్‌కు వస్తున్న మృతదేహాల సంఖ్య 136 శాతం పెరిగింది.

